# యథేచ్ఛగా కాపర్ వైర్ చోరీ

- స్క్రాప్ షాపుల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్న దుండగులు
- ఏటా వందల సంఖ్యలో దొంగతనాలు
- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టుబడని దొంగలు



ఈ ఫొటోలో ఉన్నది బెల్లంపల్లి మండలం బుధాకలాన్ గ్రామానికి చెందిన కౌలు రైతు పాయవేణి మల్లేశ్. గ్రామ శివారులో నాలుగెకరాల పొలాన్ని కౌలు తీసుకుని పంట సాగు చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం బోరు సబ్ మెర్సిబుల్ కేబుల్‌ను కట్ చేసి ఎత్తుకెళ్లారు. నాటువేసే పని వాయిదా పడింది. ఒక్కో కూలీకి రూ.500 చొప్పున ముట్టజెప్పి రూ.500 వెచ్చించి కొత్త కేబుల్ తీసుకువచ్చి కనెక్షన్ ఇప్పించాడు.

బెల్లంపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పంపు మోటార్ల విద్యుత్ సబ్ మెర్సిబుల్ కేబుల్ యథేచ్ఛగా చోరీకి గురవుతున్నాయి. గుర్తుతెలియని దుండగులు కరెంట్ కేబుల్‌ను కట్ చేసి కాపర్‌ను ఎత్తుకెళ్తున్నారు. స్క్రాప్ షాపుల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 8 వేల వరకు వ్యవసాయ విద్యుత్ పంపు మోటార్లు ఉన్నట్లు అంచనా కాగా, వీటిలో నుంచి ఏటా వందల సంఖ్యలో కేబుల్, స్టార్టర్లు చోరీ అవుతుండటం సర్వసాధారణ తంతుగా మారింది.

**బెండళ్ల కొద్దీ కేబుళ్ల అపహరణ**

వ్యవసాయ సీజన్ కావడంతో రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యారు. వర్షాలు సరిగా కురవకపోవడంతో బోర్లు వేసుకున్నవారు వరినాటు వేసుకోవడానికి ఎదురుచూస్తున్నారు. మరోపక్క గుర్తుతెలియని దుండగులు బోరు పంప్‌నకు అనుసంధానం చేసిన సబ్ మెర్సిబుల్ కేబుల్‌ను బెండళ్లకొద్దీ కట్ చేసుకుని ఎత్తుకెళ్తున్నారు. రెండు రోజుల క్రితం బెల్లంపల్లి మండలం బుధాకుర్దు శివారులో 9 వ్యవసాయ పంపు సెట్ల కేబుల్‌ను చోరీ చేయడం కలకలం రేపింది. అంతకుముందు నెలల వారీగా పంపు మోటార్ల కేబుళ్లు, స్టార్టర్లు అపహరణకు గురయ్యాయి. అదేతీరుగా తాండూర్, కాసిపేట, భీమిని, నెన్నెల, కన్నెపల్లి, వేమనపల్లి మండలాల పరిధిలో సబ్ మెర్సిబుల్ కేబుళ్లను దొంగలు చోరీ చేసి తీసుకెళ్తున్నట్లు రైతులు చెబుతున్నారు.



సబ్ మెర్సిబుల్ కేబుల్ కట్‌చేసి తీసుకువెళ్లడంతో నిరుపయోగంగా బోరు

**పనులు వాయిదా**

కేబుల్‌ను చోరీ చేసి తీసుకెళ్తుండటంతో రైతులు తంటాలు పడాల్సి వస్తోంది. బోరు లోపలి నుంచి కేబుల్‌ను కట్ చేస్తుండటంతో కొత్తది కొనుగోలు చేయక తప్పడం లేదు. అయితే కేబుల్‌ను జత చేయడానికి అంతర్భాగంలో ఉన్న బోరును ఉపరితలానికి తీసుకురావల్సి ఉంటుంది. ఇందుకోసం ఐదుగురు సహకారం కావాలి. ఒక్కో వ్యక్తికి రూ.500 చొప్పున డబ్బులు చెల్లించి పని చక్కబెట్టుకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా కేబుల్ కనెక్షన్ ఇవ్వడానికి ఒకటి, రెండు రోజుల పాటు వ్యవసాయ పనులు వాయిదా వేసుకుంటున్నట్లు చెబుతున్నారు. అంతకుముందు సబ్‌మెర్సిబుల్ కేబుళ్లు, స్టార్టర్లను అగంతకులు పట్టుకెళ్తున్నట్లు కొందరు రైతులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా నిందితులు పట్టుబడడం లేదు. పనులు వదులుకుని రైతులు ఠాణా చుట్టూ తిరగలేక మిన్నకుండి పోతుండటంతో దొంగలు రెచ్చిపోతున్నారు.

### పొలం పనులకు ఆటంకం



వ్యవసాయ పంపు మోటార్ల సబ్ మెర్సిబుల్ కేబుల్‌ను కట్ చేసి తీసుకెళ్తుండటంతో పొలం పనులకు ఆటంకం కలుగుతుంది. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసిన దొంగలు పట్టుబడలేదు. మళ్లీ రెచ్చిపోతున్నారు. – బియ్యాల పోశం, రైతు

### దొంగలను పట్టుకోవాలి



రైతులకు కేబుల్, స్టార్టర్ల దొంగతనాలు తలనొప్పిని కలిగిస్తున్నాయి. అర్ధరాత్రి పొలం వద్ద కాపలా ఉండాల్సి వస్తోంది. అయినా కూడా దొంగతనాలు ఆగడం లేదు. పోలీసులు దొంగలను గుర్తించి పట్టుకోవాలి. – దొలకాసి నాగరాజు, రైతు

## క్లుప్తంగా

### సామూహిక కుంకుమ పూజలు



పాల్గొన్న మహిళలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక రాళ్లపేట్ గౌతమినగర్ శివపంచాయితన ఆలయంలో శ్రావణశుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శంశాక్‌శర్మ పాల్గొన్నారు.

### ఆలయంలో వరలక్ష్మి వ్రతాలు



వ్రతంలో మహిళలు

లక్సెట్టిపేట: మున్సిపాలిటి పరిధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు, కుంకుమ పూజలు జరిగాయి. మహిళలు పాల్గొని లలిత పారాయణం, అష్టలక్ష్మి పూలతో దేవతలను అలంకరించి పూజలు నిర్వహించారు. వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న వారికి లక్కీడిప్ ద్వారా డ్రా తీశారు. విజేతలకు బహుమతులు, చీరలు ప్రదానం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు సుధాకర్, మహేందర్, శ్రీనివాస్, లచ్చన్న, అనిల్ సంతోష్, రాజేశం, మహిళా సంఘం నాయకులు నరేందుల సాహితి, స్వప్న, రాధిక, శరణ్య, హిమబిందు పాల్గొన్నారు.

### విద్యార్థులకు వసతులు కల్పించాలి



పరిశీలిస్తున్న కమిషనర్ రమేశ్

బెల్లంపల్లి: విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ అన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని పరిశీలించి విద్యార్థుల కోసం వండిన ఆహారాన్ని రుచి చూశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, అభ్యాసానికి అవసరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రిన్సిపాల్ నిరుపమ, మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ సాయికిరణ్, టీపీవో చంద్రశేఖర్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్ ఉన్నారు.

### ‘స్థానిక’ ఎన్నికల్లో సత్తాచాటాలి



మాట్లాడుతున్న రమేశ్

వేమనపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మండల స్థాయి ఎంపీటీసీ ఎన్నికల కార్యశాల కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో గ్రామస్థాయి నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థాయిలో అనుసరించాల్సిన విధి విధానాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతీ పంచాయతీలో సమస్యలపై పోరాడాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలు, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుకర్, నాయకులు వెంకటేశ్, చరణ్‌రాజ్, శ్రీకాంత్, సత్యనారాయణ, రమేశ్‌గౌడ్, అజయ్‌కుమార్, మధునయ్య, కిశోర్ పాల్గొన్నారు.

### ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



వివరిస్తున్న ఏఎన్‌ఎం నాగలక్ష్మి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టత, తల్లిపాలను బిడ్డకు పట్టించడం వల్ల కలిగే లాభాలను వివరించారు. పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లిపాలు పట్టించడంతో శిశువుకు రోగ నిరోధక శక్తి పెంచుతుందని అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం పద్మ, సహాయకురాలు లత పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్య పరిష్కారం

- హర్షం వ్యక్తం చేసిన కొత్తూర్ రైతులు

నెన్నెల: మండలంలోని కొత్తూర్ గ్రామంలో రెండు నెలల క్రితం వీచిన ఈదురుగాలులకు 11కేవీ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. త్రీఫేజ్ కరెంట్ సరఫరా లేక పొలాలకు నీరందక రైతులు ఎదుర్కొంటున్న సమస్యను కాంగ్రెస్ నాయకులు మహ్మద్ జలీల్, తలండి పోశమల్లు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.4 లక్షలు విద్యుత్ శాఖకు చెల్లించి అధికారులతో మాట్లాడారు. వెంటనే విద్యుత్ లైన్‌ను పునరుద్ధరించాలని ఆదేశించారు. శుక్రవారం ఏడీ రవికుమార్ పర్యవేక్షణలో ఏఈ రాజన్న, లైన్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ విద్యుత్ పనులు పూర్తి చేశారు. త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను అందించారు. సమస్య పరిష్కారం కావడంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వినోద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు బోయిని పోశం, మంజునాయక్, మధుకర్, రాజలింగు, చక్రపాణి, రైతులు పాల్గొన్నారు.



విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్న అధికారులు

# ఘనంగా ఆటో కార్మికుల దినోత్సవం

పాతమంచిర్యాల/తాండూర్: ప్రపంచ ఆటో కార్మిక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆటో ఓనర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాలలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ఆటో జేఏసీ ప్రణాళిక చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్. ఆటో యూనియన్ జెండావిష్కరించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లతో ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేసి వడ్డీలేని రుణాల అందించాలని, కార్మికులకు జీవన భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. తాండూర్‌లో ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు మహ్మద్ ఆబీబాషా ఆధ్వర్యంలో ఆటో కార్మికులు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం 120 మంది సీనియర్ ఆటో డ్రైవర్లను సన్మానించారు. నాయకులు మురళి, మధుకర్, విక్రమ్, రాంకుమార్, ఆంజయ్య, శ్రీనివాస్, సుధాకర్, శంకర్, విద్యాసాగర్, రాజానంద్, రవి తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాలలో కేక్ కట్ చేసి పంపిణీ చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

## నేడు విద్యుత్ అంతరాయం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర సబ్‌స్టేషన్, 33 కేవీ లైన్ మరమ్మతు, చెట్లకొమ్మలు తొలగించేందుకుగాను శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ కౌట్టి శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు, రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

# పోలీస్ అకాడమీ డైరెక్టర్‌ను కలిసిన సిబ్బంది

నస్పూర్: మంచిర్యాల జోన్ పరిధిలోని పోలీసులతో సమీక్షా సమావేశంలో పాల్గొనడానికి సీసీసీ సింగరేణి గెస్ట్‌హౌజ్‌కు విచ్చేసిన ఆర్‌బీవీఆర్‌ఆర్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్‌బిస్త్‌ను 2000 బ్యాచ్‌కు చెందిన పలువురు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆమెకు శాలువా ఇచ్చి మొక్కను బహూకరించారు. 2000లో వరంగల్ మామునూరు పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్‌గా అభిలాష్‌బిస్త్ ఉన్నారని, ఆమె ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నామని సిబ్బంది తెలిపారు. ఇప్పుడు ఇలా కలుసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. హెడ్ కానిస్టేబుళ్లు బుద్దె రవి, ఉపేందర్, రాజు, రవి, మల్లారెడ్డి, చంద్రమోహన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



డైరెక్టర్‌కి మొక్కను బహూకరిస్తున్న సిబ్బంది

# దేశ ఆర్థిక పురోభివృద్ధిలో మహిళలు కీలకం

నస్పూర్: దేశ ఆర్థిక పురోభివృద్ధిలో మహిళలు కీలకమని టీజీబీ మంచిర్యాల రీజనల్ మేనేజర్ దాముక ప్రభుదాస్ అన్నారు. సీసీసీలోని టీజీబీ సీతారాంపల్లి శాఖలో మెప్మా ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీతారాంపల్లి శాఖ పరిధిలో ఇప్పటి వరకు 632 మహిళా సంఘాలకు రూ.50 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ముద్ర యోజన కింద 30 మంది మహిళలకు రూ.30 లక్షలు రుణాలు మంజూరు చేశామని తెలిపారు. సీతారాంపల్లి శాఖ పరిధిలో జులైలో 36 స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ.6.5 కోట్లు రుణాల మంజూరైన చెక్కులను సభ్యులకు అందజేశారు. మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్, మంచిర్యాల రీజనల్ రుణాల మంజూరు ప్రధాన అధికారి రవికిశోర్‌రెడ్డి, సీతారాంపల్లి శాఖ మేనేజర్ నరసింహాస్వామి, ఫీల్డ్ ఆఫీసర్ రవి, ఆర్పీలు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న రీజనల్ మేనేజర్ ప్రభుదాస్

# అంకితభావంతో పనిచేయాలి

జన్నారం: గిరిజన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని, సమయ పాలన పాటించి నాణ్యమైన విద్యనందించాలని మంచిర్యాల అకాడమిక్ కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ లక్ష్మయ్య, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శివరాజం పేర్కొన్నారు. ఐటీడీఏ పీవో ఆదేశాలతో జన్నారం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలకు సంబంధించి అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని, వారికి సరైన విద్య అందించాలన్నారు. టీడబ్ల్యూపీఎస్ ఉపాధ్యాయుల అటెండెన్స్ రోజులో మూడుసార్లు జీపీఎస్ ఫొటోస్ ద్వారా మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో జన్నారం, దండేపల్లి మండలాల టీడబ్ల్యూపీఎస్ ఉపాధ్యాయులతోపాటు రఘునాథం, బుచ్చన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివరాం

# అంబేడ్కర్ జిల్లా మహిళా సంఘం ఎన్నిక

రామకృష్ణాపూర్: ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా మహిళా సంఘాన్ని శుక్రవారం మందమర్రిలో ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షురాలిగా సుంకరి లక్ష్మి, అధ్యక్షురాలిగా బండ శాంఖరి, ఉపాధ్యక్షురాలుగా పద్మజ, ఉప్పులేటి గోపిక, సునీత, సుహాసిని, జిల్లా ప్రధాన కార్యదర్శిగా స్వర్ణ, సంయుక్త కార్యదర్శులుగా స్వరూప, భాగ్యలక్ష్మి, కవిత, లక్ష్మి, ప్రచార కార్యదర్శులుగా పులిపాక భాగ్యలక్ష్మి, స్వర్ణలత, భవానీ, మాధురి, కోశాధికారిగా రుక్మిణి ఎన్నికయ్యారు.



ఎన్నికైన మహిళా సంఘం సభ్యులు

## వ్యాధులపై అవగాహన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్యం ముఖ్యమని వైద్య, ఆరోగ్య శాఖ హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. గుడిపేట మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాప్తి చెందే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలకాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోదకాలు, మెదడు వాపు వ్యాధులు వ్యాప్తిస్తాయని, వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. దోమల ఉత్పత్తిని అరికట్టడానికి డ్రైడే పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి, హెచ్‌ఈఓ రఘుపతి, ఆరోగ్య పర్యవేక్షకురాలు పద్మ, పాఠశాల స్టాఫ్‌నర్స్ సుమలత, ఆశకార్యకర్త పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బొగ్గుబాయి వార్తలు

బెల్లంపల్లి: సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బెల్లంపల్లి, గోలేటి బ్రాంచీల ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, గని ఫిట్ సెక్రెటరి తిరుపతిగౌడ్ డిమాండ్ చేశారు. గనిపై శుక్రవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటాను వెంటనే 35 శాతం చెల్లించాలన్నారు. కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని అమలు చేసి ఒక్కో కార్మికుడికి 300 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని పేర్కొన్నారు. గనిలో ఏర్పడిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతోపాటు ఖాళీగా ఉన్న వివిధ విభాగాల పోస్టులు భర్తీ చేయాలన్నారు. బూట్లు, చేతి గ్లౌజులు సరఫరా చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం

### గని కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గని మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హాకు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ నాయకులు రాంచందర్, స్వామిదాసు, రాజలింగు, రమేశ్, భాస్కర్, శ్రీనివాస్, ప్రవీణ్, సంతోష్, రాజేష్, సారయ్య, రామకృష్ణ, రాజయ్య, శ్రావణ్ పాల్గొన్నారు.

కాసిపేట: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మందమర్రి ఏరియా కాసిపేట–1 గని మేనేజర్ సతీశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన గేటు మీటింగ్‌లో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ మాట్లాడారు. 2024–25 సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటా వెంటనే 35 శాతం చెల్లించాలని, సొంతింటి పథకం అమలు చేయాలన్నారు. బ్రాంచి కోశాధికారి నాగేశ్వరరావు, పిట్ సెక్రెటరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

**జీఎంకు వినతిపత్రం**

రామకృష్ణాపూర్: సింగరేణి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం గనులు, డిపార్ట్‌మెంట్లపై నిరసనలు తెలిపి మందమర్రి జీఎం దేవేందర్‌కు వినతిపత్రాన్ని అందించారు. యూనియన్ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్, శ్రీనివాస్, గీతిక, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

### కోలిండియా విధానాలు అమలు చేయాలి

రామకృష్ణాపూర్: కార్మిక సంఘాల ప్రాధాన్యత విధానాలు కోలిండియాలో అమలవుతున్న రీతిలో సింగరేణిలోనూ అమలు చేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. శుక్రవారం మందమర్రిలో సింగరేణి కార్మికుల డిమాండ్లతో కూడిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాజమాన్యం జాతీయసంఘాలతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించాలన్నారు. సింగరేణిలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాదాసి రవీందర్, రమేశ్, ప్రదీప్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

### రిఫరల్ కార్మికులకు అన్యాయం

శ్రీరాంపూర్: మెడికల్ బోర్డులో రిఫరల్ కార్మికులకు అధికారులు అన్యాయం చేశారని హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, బ్రాంచి ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల క్రితం అనారోగ్య కారణాలతో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులకు కొన్నినెలల క్రితం పిలిచి వారిని హయ్యర్ సెంటర్లకు రిఫరల్ చేశారని పేర్కొన్నారు. తిరిగి వారికి మూడు రోజుల క్రితం కొత్తగూడెంలో మెడికల్ బోర్డుకు పిలిచారని తెలిపారు. వీరిలో మొత్తం 55 మంది ఉంటే వారిలో 52 మందిని ఫిట్ ఫర్ సేమ్ జాబ్ అని ఇచ్చి అన్యాయం చేశారని పేర్కొన్నారు. జబ్బులతో బాధపడుతున్న వారిని అన్‌ఫిట్ చేయాల్సి ఉందని తెలిపారు.

### రక్షణలో సూపర్‌వైజర్ల పాత్ర కీలకం

శ్రీరాంపూర్: రక్షణ చర్యలు చేపట్టడంలో ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్ల పాత్ర ఎంతో కీలకమని శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం శ్రీరాంపూర్ వీటీసీలో భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనుల్లో పనిచేసే వివిధ విభాగాల ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లకు 12 రోజుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఐదేళ్లకోసారి శిక్షణ ఇవ్వనున్నట్లుతెలిపారు. వృత్తిలో ఎప్పటికప్పుడు నైపుణ్యం పెంచుకునేందుకు ఇలాంటి శిక్షణ దోహదపడతాయన్నారు. గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీసైదా, వీటీసీ మేనేజర్ కమ్రుద్దీన్, అసిస్టెంట్ మేనేజర్ రామ్‌రావు, శిక్షకుడు రాజకుమార్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

### రిటైర్డ్ అధికారికి సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్అండ్‌పీసీ డిపార్టుమెంట్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన శంకరయ్యను అధికారులు సన్మానించి వీడ్కోలు పలికారు. డిపార్టుమెంట్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు రాంరెడ్డి, రాజన్న, నాయకులు బద్రి బుచ్చయ్య, పిట్ సెక్రెటరీ మల్లికార్జున్ పాల్గొన్నారు.

## దండేపల్లి ఏపీఎంగా లక్ష్మి

దండేపల్లి: ఐకేపీ ఏపీఎంగా తోట లక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన బ్రహ్మయ్య భీమిని మండలానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో లక్సెట్టిపేట ఏపీఎంగా పనిచేసిన లక్ష్మి బదిలీపై ఇక్కడకు వచ్చారు. విధుల్లో చేరిన ఆమెకు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అనిత, మండల సభ్యులు, సీసీలు, వీవోఏలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఐకేపీ సిబ్బంది, వీవోఏలతో పరిచయం చేసుకున్నారు. మహిళ సంఘాల ఆర్థిక అభివృద్ధిపై చర్చించారు.

**జైపూర్ ఏపీఎంగా బాధ్యతలు**

జైపూర్: జైపూర్ ఏపీఎంగా చి.సంతోశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఐదేళ్ల పాటు ఇక్కడ పనిచేసిన రాజ్‌కుమార్ కాసిపేట మండలానికి బదిలీయ్యారు. కలెక్టరేట్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన సంతోశ్ బాధ్యతలు అనంతరం మాట్లాడారు. మహాలక్ష్మి సమాఖ్యను మరింత బలోపేతం చేయడం, ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తానని సంతోశ్ తెలిపారు. అనంతరం సమాఖ్యసభ్యులు, ఉద్యోగులు ఆయన్ను సన్మానించారు.

**భీమిని ఏపీఎంగా బ్రహ్మయ్య**

భీమిని: భీమిని ఏపీఎంగా భూపతి బ్రహ్మయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దండేపల్లి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయనకు ఐకేపీ సీసీలు,సీఏలు, సిబ్బంది స్వాగతం పలికారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

భీమిని: కేజీబీవీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో గంగామోహన్‌తో కలసి సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. కేజీబీవీ పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. ఏపీవో సత్యప్రసాద్ తదితరులు ఉన్నారు.

## వీధి కుక్కదాడిలో చిన్నారికి గాయాలు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధి గద్దెరాగిడిలో గల కేకే జోన్ బిల్డింగ్ వద్ద ఓ వీధి కుక్కదాడిలో లక్ష్మి అనే చిన్నారి గాయపడింది. శుక్రవారం ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో వీధి కుక్క ఒక్కసారిగా దాడి చేయడంతో ఆమెకు గాయాలు కాగా వెంటనే మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.